క్లుప్తంగా

నేడు హనుమాన్ జయంతి

ఆత్మకూరు: పట్టణంలోని పాత బస్టాండు, అంబాభవానీ, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంతో పాటు శివాలయాలు, ఇతర దేవాలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పాత బస్టాండు, శివాలయాల్లో ఉదయం 6 గంటలకు ఆంజనేయస్వామి వారికి సుప్రభాత సేవ, కుంకుమార్చనలు, విశేష పూజలు, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత



రామాపురంలో కాలువలు శుభ్రం చేస్తున్న దృశ్యం

మహానంది: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు బండిఆత్మకూరు మండల ఈఓఆర్‌డీ శ్రీనివాసులు తెలిపారు. బండిఆత్మకూరు మండలం రామాపురం గ్రామంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తాగునీరు, పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చెంచుగూండెంలో వైద్యశిబిరం



బాలింతను పరీక్షిస్తున్న వైద్యులు

ఆత్మకూరు: బైర్లూటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రుద్రకోడూరు చెంచుగూండెంలో శుక్రవారం 104 ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కానుందని, కాచి వడబోసిన నీటిని తాగాలని గిరిజనులకు సూచించారు. ఇక దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. సీహెచ్‌ఓ శివ, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, శారద, డీఈఓ రవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న ఆటో

- తల్లీ, కుమారుడికి గాయాలు



గాయపడిన ఫాతిమాబీ

మహానంది: బండిఆత్మకూరు–సంతజూటూరు గ్రామాల మధ్య వంతెన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ, కుమారుడికి గాయాలైన ఘటన బండిఆత్మకూరు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన షేక్ ముత్తు, కుటుంబ సభ్యులు బైక్ మీద వస్తుండగా ఎదురుగా వెళ్తున్న ఆటో ఢీకొనడంతో షేక్ ఫాతిమాబీ, కుమారుడు ఖలీల్ గాయపడ్డారు. అదే సమయంలో సంతజూటూరు గ్రామానికి విధులకు వెళుతున్న వీఆర్వో సుంకన్న స్పందించి 108 వాహనానికి సమాచారం అందించారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



ఏడీసీ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆత్మకూరు: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు పేర్కొన్నారు. స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న ఏడీసీ ప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏడీసీ ప్రసాద్ ఆర్టీసీ డ్రైవర్‌గా ఆత్మకూరు డిపోలో ఎన్నో ఏళ్లుగా పనిచేసి, పదోన్నతిపై ఇదేడిపోలో ఏడీసీగా పనిచేసి పదవీ విరమణ పొందడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఏడీసీ దంపతులను సన్మానించారు. ఆర్టీసీ సీఐ నాయక్, డ్రైవర్ జాన్, ఉసేనయ్య, గౌడ్, శీనయ్యతో పాటు వివిధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బియ్యం బదులుగా జొన్న, రాగులు పొందొచ్చు

జూపాడుబంగ్లా: జూన్ మాసానికి సంబంధించి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాల వద్ద ఉచితంగా పంపిణీ చేసే బియ్యానికి బదులు 3 కిలోల జొన్నలు లేదా రాగులు పొందవచ్చని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 11,985 రేషన్‌కార్డులుండగా వారికి 29,968 కిలోల రేషన్‌బియ్యం మంజూరు అవుతుందన్నారు. ఒక్కో లబ్ధిదారునికి 5 కిలోల చొప్పున ఉచిత రేషన్‌బియ్యం అందజేస్తుండగా ఇష్టమైతే 3 కిలోల జొన్నలు లేదా రాగులు వేయించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్‌ఐ అశోక్

ఆత్మకూరు: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీలు శ్రీనివాసరావు, రమణారావు తెలిపారు. శుక్రవారం పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ముగిసేంత వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గెలుపొందిన వారు ర్యాలీలు, విజయోత్సవ సంబరాలు చేపట్టరాదన్నారు. ప్రశాంతంగా ఉన్న ప్రదేశాల్లో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నంద్యాల సర్కిల్ నుంచి గౌడ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, ఎమ్మార్వో ఆఫీసు, అంబేడ్కర్ సర్కిల్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. టౌన్ సీఐ లక్ష్మీనారాయణ, రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్‌ఐలు హరిప్రసాద్, భూపాలుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలపై నిషేధం

పాములపాడు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని ఎస్‌ఐ అశోక్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గెలుపు, ఓటములు సహజమని, ఉద్వేగాలకు గురికావొద్దని సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో నాయకులు సంయమనంతో వ్యవహరించాలని, కార్యకర్తలు, అభిమానులను అదుపులో ఉంచుకోవాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

జూపాడుబంగ్లా: ఓట్ల లెక్కింపునకు ముందు, లెక్కింపు పూర్తయిన తర్వాత ఎవ్వరైనా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని మండ్లెం గ్రామంలో ఆత్మకూరు డీఎస్పీ అధ్వర్యంలో నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, టౌన్ సీఐ ప్రకాశ్‌కుమార్, ఎస్‌ఐలు లక్ష్మినారాయణ, నాగార్జున, జయశేఖర్, జగన్‌మోహన్ పోలీసు సిబ్బందితో గ్రామంలోని వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలీసుయాక్టు 30 తో పాటు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవ్వరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. ప్రజలు వివాదాలకు దూరంగా ఉండి ప్రశాంతంగా జీవించాలన్నారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా పేల్చడానికి అనుమతుల్లేవని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కవాతులో పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- అర్థవంతంగా సాగిన మండల సర్వసభ్య సమావేశం
- కరెంట్ తీగలు కిందకు వేలాడుతున్నా పట్టించుకోని అధికారులపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా శాఖల అధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు ఒక్కపైసా అప్పు లేకుండా చెల్లించినా విద్యుత్ సమస్యలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఎంపీపీ నిలదీశారు. గ్రామాల్లో వీధుల వెంట విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యుదాఘాతంతో ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సచివాలయాల విద్యుత్ ఉద్యోగులు అందుబాటులో లేకపోతే ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడం ఖాయమని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత హెల్త్ సిబ్బందిపై ఉందన్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యం లోపించకుండా కృషి చేయాలని గ్రామాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యారంగంలో ప్రభుత్వం తెస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్ది మౌలిక వసతులు కల్పించినట్లు గుర్తు చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ కల్లిమున్నీసాబేగం, ఈఓఆర్డీ సంజన్న, ఎంఈఓ ఫైజున్నీసా బేగం, గ్రామాల సర్పంచులు జనార్ధన్‌గౌడ్, మరియమ్మ, వీరం జయలక్ష్మమ్మ, నవీన్, దామోదర్ రెడ్డి, సురేష్, నాగేశ్వరరావు, దేవమ్మ, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని పరిరక్షించుకోవాలి



ఆలయంలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: ఇతిహాసాలు భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటుతున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, జయదేవానంద స్వామిజీ అన్నారు. స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం గోపూజ, కుంకుమార్చన, తదితర విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో నైతిక విలువలతో కూడిన విద్య, సద్గుణాలు, ఇతిహాసములు (రామాయణం, మహాభారతం, భగవద్గీత) తదితర వాటిపై అవగాహన పెంచేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. భారతీయ సంస్కృతిని సంరక్షించుకోవాలన్నారు. అనంతరం ఆలయంలో గోపూజ విశిష్టతను వివరించి, కుంకుమార్చన, గోపూజ నిర్వహించారు. ఆలయ పురోహితులు వెంకట్రామయ్య, రామ్మోహన్, శేషాద్రి, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి వేడుకలు

మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలోని రామాలయంలో శనివారం హనుమంతుడికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు, హనుమాన్ శోభాయాత్ర, ధార్మిక ప్రవచనాలు నిర్వహించనున్నట్లు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు హనుమాన్ రథోత్సవం



వేడుకలకు సిద్ధమైన హనుమాన్ విగ్రహం

పగిడ్యాల: హనుమాన్ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొత్త ఎల్లాల గ్రామంలో హనుమాన్ రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి, సీతారామలక్ష్మణ స్వామి, చెన్నకేశవస్వామి దేవతామూర్తులకు పంచామృత అభిషేకాలు, సింధూర లేపనం, వస్త్రాలంకరణ, పూలమాలల అలంకరణ, పుష్పార్చన, నాగవల్లి పూజ, ఆకుపూజ, వడమాల సేవ, మహా మంగళ హారతి పూజలను వేద పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని వెల్లడించారు. సాయంత్రం మేళతాళాల నడుమ వైభవంగా రథోత్సవం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

హనుమాన్ జయంతి వేడుకలు

నందికొట్కూరు: పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు సీతా రామాలయం కమిటీ చైర్మన్ ఉపేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక సీతారామాలయంలో ఉదయం 9 గంటలకు అభిషేకం, 10:30 గంటలకు ఆకుపూజ, హారతి, తీర్థ ప్రసాదాలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి హనుమాన్ శోభాయాత్రను కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

స్తంభించిన సిగ్నల్ సేవలు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంతో పాటు సమీప గ్రామాలైన తాటిపాడు, 80బన్నూరు, తరిగోపుల, పి.లింగాపురం తదితర గ్రామాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎయిర్‌టెల్, జియో కంపెనీల సిగ్నల్స్ స్తంభించడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సెల్‌ఫోన్స్‌కు సిగ్నల్స్ లేకపోవటంతో ఫోన్‌కాల్స్ వెళ్లకపోవటం, రాకపోవటంతోపాటు నెట్‌వర్క్ ప్రాబ్లంతో వాట్సప్‌తోపాటు అన్నిరకాల సేవలు నిలిచిపోయాయి. అత్యవసరమైన వినియోగదారులు సమాచారం చేరవేసేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆగ్రహానికి గురైన కొంత మంది వినియోగదారులు ఎయిర్‌టెల్, జియో సంస్థల నిర్వాహకులను విమర్శించారు. ఎట్టకేలకు మధ్యాహ్నం 1.30 గంటలకు సిగ్నల్స్ పునరుద్ధరించి సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన పది సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తపల్లి: మే 24 నుంచి జరుగుతున్న పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించినట్లు పరీక్షల నిర్వహణాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 49 మంది హాజరు కావాల్సి ఉండగా 8 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మిగతావారు గతంలో రాసినటువంటి రెగ్యూలర్ పరీక్షలకు కూడా హాజరు కాలేదని చెప్పారు.

దుర్గమ్మ గుడిలో చోరీ

మహానంది : అబ్బీపురం గ్రామంలోని దుర్గమ్మ గుడిలో చోరీ జరిగినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. గురువారం రాత్రి జరిగిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చిందన్నారు. సుమారు 20 కిలోలతో తయారు చేసిన మూడు కంచు కట్టలను గుర్తు తెలియని దుండగులు అపహరించుకెళ్లారని చెప్పారు. దీంతో పాటు హుండీలోని కొంత నగదును ఎత్తుకెళ్లారన్నారు. దుండగులు బయట పడకుండా తప్పించుకునేందుకు సీసీ కెమెరాల వైర్‌ను కట్ చేయడం విశేషం.

చీమలతిప్ప మత్స్యకారులకు ఊరట

కొత్తపల్లి: కృష్ణానది పరివాహక ప్రాంతంలోని చీమలతిప్పలోని మత్స్యకారులు అక్కడే నివాసం ఉండవచ్చని తహసీల్దార్ తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. చీమలతిప్ప ప్రాంతంలో చేపలవేట సాగిస్తూ, అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకున్న మత్స్యకారులను అటవీ శాఖ అధికారులు ఖాళీ చేయించిన విషయం విదితమే. దీనిపై తమకు న్యాయం చేయాలంటూ మత్స్యకారులు వినతి పత్రం ఇవ్వడంతో సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో ఎలక్షన్ కోడ్ పూర్తయ్యే వరకు ద్వారా మత్స్యకారులు అక్కడే ఉండొచ్చని, అటవీ శాఖ అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూడాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారని ఆత్మకూరు ఆర్డీఓ దాసు వివరించారన్నా రు. దీనిపై మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శిల్పా గెలుపు కోసం ప్రత్యేక పూజలు



ఆలయం ఎదుట టెంకాయలు కొడుతున్న నాయకులు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణి రెడ్డి రెండో సారి అఖండ విజయాన్ని సొంతం చేసుకోవాలని ఆత్మకూరు జీవసజ్యోతి వికలాంగుల సేవా సంస్థ అధ్యక్షుడు వేణుగోపాల్ జమ్ములమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారికి 101 టెంకాయలు సమర్పించారు. వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, కౌన్సిలర్ కలీముల్లా, మారుబోతులస్వామి, మార్కెట్‌యార్డు చైర్మన్ బాలస్వామి, మాజీ ఎంపీటీసీ సోమశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి శిల్పా అహర్నిశలు శ్రమించారన్నారు. నాయకులు రవినాయక్, ప్రతాప్, రాజశేఖర్, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ–2 శ్రీనాథ్

మిడుతూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ –2 శ్రీనాథ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో.. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు. శిక్షణలో ట్రైనీ చెప్పిన విషయాలను మధ్యాహ్న భోజనం తయారుచేసే సమయంలో కచ్చితంగా అమలు చేయాలన్నారు. డీటీపీ చంద్రకాంత్, సీఆర్‌పీలు మౌలాబి, రమణ, ఎంఐఎస్ మధు, వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాల మంజూరు

జూపాడుబంగ్లా: ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన కంది, మినుము విత్తనాలు రాయితీపై అందజేస్తున్నట్లు ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఆశ–87119, ఎల్‌ఆర్‌జీ–52 రకాలైన కంది విత్తనాలు 65 క్వింటాళ్లు మంజూరైనట్లు తెలిపారు. క్వింటం కందుల పూర్తి ధర రూ.13,980 కాగా రూ.4,194 సబ్సిడీపోనూ రైతులు రూ.9,786 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆర్బీకేల్లో నాలుగు కిలోల బ్యాగుల చొప్పున రైతులకు అందుబాటులో కందులు లభిస్తున్నట్లు తెలిపారు. రాయితీపోను రూ.392 చెల్లించి 4 కిలోల కందుల బ్యాగు పొందవచ్చునన్నారు. మినుములు క్వింటం పూర్తి ధర రూ.14 వేలు కాగా రాయితీ రూ.4,200 పోను రైతులు రూ.9,800 చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు కిలోల ప్యాకెట్ ధర రాయితీ పోను రూ.392 చెల్లించి పొందవచ్చునన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి అవకాశాల మెరుగు



ఉద్యోగ నియామక పత్రాలతో డిప్లొమా విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని శ్రీశైలం ప్రభుత్వం మోడల్ రెసిడెన్సియల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.రంగయ్య అన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో వివిధ సంస్థలలో క్యాంపస్ సెలెక్షన్‌లో ఉద్యోగ అవకాశాలు పొందిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులను ప్రిన్సిపాల్ రంగయ్య, నియామకాల అధికారి డాక్టర్.కె.లక్ష్మీపతి అభినందించారు. రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే పేరు ప్రతిష్టలు

మహానంది: ప్రజలకు చేసిన సేవలే ఉద్యోగులకు పేరు ప్రతిష్టలు తెచ్చిపెడతాయని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భగవాన్ దాస్ అన్నారు. పీహెచ్‌సీలో పీహెచ్‌ఎన్ పుష్పలీల పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఆమెను సన్మానించారు. ఆరోగ్య సిబ్బంది ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ నటరాజు, ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జూపాడుబంగ్లా: లైసెన్స్ లేకుండా ఎవరైనా అక్రమంగా మొక్కజొన్న, పత్తి, కంది తదితర విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున రైతులు విత్తన కొనుగోలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్స్ కలిగిన విత్తనాల దుకాణాల్లోనే వ్యవసాయ అధికారుల సలహా, సూచనల మేరకు విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లులు పొందడంతో పాటు విత్తనం నాటిన నుంచి దిగుబడి వచ్చే వరకు బిల్లులు, విత్తన బ్యాగులను భద్రపర్చుకోవడం మంచిదన్నారు. వ్యాపారులు రైతుల పేరిట వారి ఆధార్ నంబర్, సంతకాలు నమోదు చేసి బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

కుంటను తలపిస్తున్న రోడ్డు

పాములపాడు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో వీధి కుళాయిల నీరు రోడ్డుపై నిలిచి కుంటను తలపిస్తోంది. స్థానిక రామాలయం వద్ద మిట్టకందాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రధాన రహదారి గుంతలా మారింది. ఎగువ ప్రాంతంలో ఉన్న కుళాయిల నుంచి నీరు వృథాగా ప్రవహించడంతో ఆ నీరంతా రహదారి వెంట ప్రవహించి గుంతగా ఉన్న దారిపై చేరి కుంటను తలపిస్తోంది. అటువైపు ఇళ్లకు వెళ్లే వారు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రహదారిలో నిలిచిన నీరు

తూము ఏర్పాటుచేసి సాగునీరివ్వాలి

జూపాడుబంగ్లా: కేసీ కాల్వ 98 లాకిన్స్‌లా వద్ద ప్రత్యేక తూము ఏర్పాటుచేసి తాటిపాడు, 80 బన్నూరు గ్రామాలకు సాగునీరందించాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ 98 తూము తర్వాత కేసీ కాల్వ కింద తాటిపాడు, 80 బన్నూరు గ్రామాల రైతులకు సంబంధించి 700 ఎకరాల సాగుభూమి ఉందన్నారు. ఈ పొలానికి సాగునీరు అందక రైతులు ఏటా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జిల్లా మేజర్ ఇరిగేషన్ అధికారులు, కేసీ కాల్వ అధికారులు రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక తూమును ఏర్పాటుచేసి సాగునీరు అందించాలని కోరారు. లేకపోతే రైతులను పోగుచేసి ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. రైతులు నరసింహ, తిరుమలయ్యగౌడు, మహేష్, వెంకటేశ్వర్లు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పారితోషికం అందేదెన్నడు!

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి ఇవ్వాల్సిన పారితోషకంతో పాటు కొందరు దిగువ స్థాయి చిరుద్యోగులతో పెట్టించిన ఖర్చులు సైతం ఇవ్వాల్సిన సొమ్ములు ఇవ్వక పోవడంతో ఆ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పనిచేయించుకున్న సిబ్బందికి ఇవ్వాల్సిన రెమ్యునరేషన్, పెట్టిన ఖర్చులు ఇవ్వాలని వారిని నియమించుకున్న అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఇచ్చే అరకొర మొత్తం ఎప్పుడు ఇస్తారో సరైన సమాధానం చెప్పకపోవడం ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హోదా పరంగా ఉన్నతస్థాయిలో ఉన్నా.. చిన్న చిన్న ఉద్యోగులకు ఇవ్వాల్సిన దానిలో చేతివాటం ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది.

రూ.52 కోట్ల బడ్జెట్ ఏమైంది?

ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయడానికి, విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు పారితోషికంగా చెల్లించడానికి జిల్లాకు రూ.52 కోట్ల వరకు కేటాయించినట్లు సమాచారం. ఇందులో ముందస్తుగా ఒక్కో నియోజకవర్గానికి రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు ఎన్నికల నిర్వహణ సొమ్ము కేటాయించారు. అయితే పోలింగ్ ముగిసినా పారితోషికం అందని ఉద్యోగులు, వివిధ సేవలందించినా బిల్లులు అందని వారు.. నియోజకవర్గ కేంద్రాల్లో చెల్లింపు అధికారులుగా ఉన్న తహసీల్దార్లను నిలదీస్తున్నారు. వచ్చిన బడ్జెట్ అయిపోయిందని కొందరు, కౌంటింగ్ పనుల మీద బిజీగా ఉన్నాం, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఇస్తామని చెప్పి కొన్ని నియోజకవర్గాల అధికారులు తప్పించుకుంటున్నారు.

చేతి చమురు వదిలించుకున్న బీఎల్వోలు..

పోలింగ్ కేంద్రాల దగ్గర ఏర్పాట్లు చేసేందుకు కొన్ని చోట్ల బీఎల్వోలు ఒక్కొక్కరు రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు వెచ్చించారు. వీరికి ఎన్నికల ముందు రోజు ఇచ్చింది కేవలం రూ.3 వేలు మాత్రమే. అయితే ఎన్నికల సంఘం రూ.8 వేలు నుంచి రూ.12 వేలు కేటాయించగా మిగిలిన మొత్తం ఏమైందనేది తెలియడం లేదు.

పాపం చిరుద్యోగులు..

ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు తమ శాఖకు చెందిన చిరుద్యోగులను నియమించుకున్నారు. ఏ చిన్న వస్తువు అవసరమైనా వీరిని పురమాయించి తెప్పించుకున్నారు. అన్నిటికి ఒకేసారి కలిపి బిల్లులు ఇస్తామని చెప్పడంతో దుకాణాల్లో ఖాతాలు పెట్టి తీసుకొచ్చారు. అయితే ఇప్పుడు వాటి గురించి అడుగుతుంటే పట్టించుకునే వారు లేదని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులను నిలదీస్తే ఏం ఇబ్బందులు ఎదురవుతాయోనని ఓ వైపు.. అప్పు చెల్లించాలని వ్యాపారుల నుంచి పెడుతున్న ఒత్తిడి మరోవైపుతో చాలమంది దిగువ స్థాయి సిబ్బంది కార్యాలయం నుంచి బయటకు వెళ్లలేకపోతున్నారు.

పైసా చెల్లించలేదు..

సెక్టోరియల్ అధికారులు, వీవీటీ టీం, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, పోస్టల్ బ్యాలెట్ అధికారులు, హోం ఓటింగ్ అధికారులు, ఈవీఎం డ్రిస్టిబ్యూషన్ అధికారులు, ఈవీఎంల రీకలెక్షన్ అధికారులు, ఈవీఎం ర్యాండమైజేషన్, పీఓ, ఏపీఓ, ఎన్నికల సిబ్బందికి ఇచ్చిన మాస్టర్ ట్రైనర్లు, నామినేషన్ సిబ్బంది, ఉప సంహరణ సిబ్బంది, నామినేషన్ పరిశీలన సిబ్బంది ఇలా వందలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులను నియమించుకున్నారు. అయితే ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా వీరికి చెల్లించక పోవడం విమర్శలకు తావిస్తోంది. ఒక్కో నియోజకవర్గంలో పది మందికి పైగా సుమారు 2 నెలల నుంచి పనిచేసిన తాత్కాలిక కంప్యూటర్ ఆపరేటర్లుకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగలేదు. వీరికి ఒక్కొక్కరికి రూ.23 వేలు చెల్లించాల్సి ఉంది.

కౌంటింగ్ పూర్తయిన వెంటనే చెల్లిస్తాం

ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులకు ఎంత ఇవ్వాలన్నది జిల్లా అధికారులు నిర్ణయించక పోవడంతో పారితోషికం చెల్లింపు ఆలస్యమైంది. ఇంతలో ఓట్ల లెక్కింపు సమయం కూడా దగ్గర పడటంతో ఆ పనుల్లో తీరిక లేకుండా ఉన్నాం. 4వ తేదీ లెక్కింపు పూర్తయిన తరువాత పారితోషికం, ఖర్చు పెట్టిన వారందరికీ చెల్లిస్తాం.

– నజీర్ అహమ్మద్, ఏఈఆర్వో, ఆళ్లగడ్డ

